సాక్షి అనకాపల్లి

సోమవారం। 23। జనవరి। 2023



డ్రోన్లతో వ్యవసాయం

పొలాలపై మందుల పిచికారీకి డ్రోన్లను వినియోగిస్తున్నారు. ప్రభుత్వం జిల్లాకు పది డ్రోన్లు కేటాయించింది.

8లో



చక్కనైన సర్దుబాటు..!

అర్హత గల ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ హోదా కల్పిస్తూ, హైస్కూళ్లలో తాత్కాలికంగా సర్దుబాటు చేస్తున్నారు.

8లో

ఏసీఏ జట్టుకు ఎంపిక



మధురవాడ: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-14 జట్టులో భానుస్వరూప్ చోటు సంపాదించాడు. ఈ బాలుడు బక్కన్నపాలెం సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. అతని తండ్రి రమణ లారీ యజమాని.

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో మంత్రి అమర్‌నాథ్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న గుడివాడ అమర్‌నాథ్

సింహాచలం: పుట్టిన రోజు సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

25న జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్ సుబ్బిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సినర్జీస్ కాస్టింగ్, వరుణ్ మోటార్స్, లక్ష్మీ కియా మోటార్స్, లక్ష్మీ హ్యుందాయ్ మోటార్స్, మ్యాంగో మోటార్స్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ కంపెనీల్లో 221 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ట్రైనీ, పెయింటర్స్, టెక్నీషియన్, సేల్స్, కన్సల్టెంట్, టెలీ కాలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీల్లో ఉత్తీర్ణత సాధించి 18-35 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆయా ఉద్యోగాల బట్టి నెలకు జీతం రూ.13,500 నుంచి రూ.25,000 వరకు ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in/ లో నమోదు చేసుకుని.. బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన సూచించారు.

సికింద్రాబాద్-అగర్తలా మధ్య స్పెషల్



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్-అగర్తలా మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. సికింద్రాబాద్-అగర్తలా(07030) వీక్లీ స్పెషల్ ప్రతి సోమవారం సాయంత్రం 4.35గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 4.40 గంటలకు బయల్దేరి ప్రతి గురువారం తెల్లవారు 3 గంటలకు అగర్తలా చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో అగర్తలాలో (07029) వీక్లీ స్పెషల్ ప్రతి శుక్రవారం ఉదయం 6.10గంటలకు బయల్దేరి ఆదివారం తెల్లవారు 3.05గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 3.25 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఫిబ్రవరి 10వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు నడుస్తుంది.

బాక్సింగ్ క్రీడాకారులకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు పొందిన క్రీడాకారులతో నారాయణరావు, జగన్నాథం, కోచ్ అబ్బు

నర్సీపట్నం: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 11న జిల్లా స్థాయి శాప్ బాక్సింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, వెలగా జగన్నాథం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా శాప్ కోచ్ కె.అబ్బు మాట్లాడుతూ ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు స్టేట్ శాప్ లీగ్ పోటీలకు వెళ్తారన్నారు. శాప్ ప్లే అండ్ ప్లే కోచ్ పావని మౌనిక, కోచ్ శేఖర్, పీడీ దేవి పాల్గొన్నారు.

మహిళా మార్ట్.. ఆర్థిక సపోర్ట్!



మాడుగులలో ఏర్పాటు చేసిన మార్ట్

ఈ విశ్వంలో పుట్టించే శక్తి.. భూమికి.. తర్వాత ఆడవారికే ఉందని అంటారు ఓ సినీ రచయిత. మహిళలు తలచుకుంటే.. కార్పొరేట్ సామ్రాజ్యాలనే సృష్టించగలరు. కాకపోతే వారికి కాస్త ఆలంబన దొరకాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. సంక్షేమ పథకాలతో సరిపెట్టకుండా.. వైఎస్సార్ చేయూత ద్వారా వారిని వ్యాపారస్తులుగా మార్చింది. ఇపుడు రూ.లక్షల వ్యయంతో నిర్వహించే మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు నడుం బిగించింది. జిల్లాలో తొలి మహిళా మార్ట్ మాడుగులలో దిగ్విజయంగా నడుస్తుండగా.. మరో మూడు చోట్ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

- మాడుగులలో తొలి మహిళా మార్ట్
- మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆస్కారం
- 1865 మంది మహిళలు.. రూ.35 లక్షల పెట్టుబడి
- సబ్బవరం, కోటవురట్ల, చోడవరంలో ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి, అనకాపల్లి : మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. వారు మరింతగా ఎదిగేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయిస్తోంది. ఇప్పటికే జిల్లాలోని మాడుగులలో డిసెంబర్ 9న మహిళా మార్ట్ ఏర్పాటయింది. త్వరలో మరో మూడు మార్ట్‌ల ఏర్పాటుకు గ్రామీణాభివృద్ధి శాఖ సన్నాహాలు చేస్తోంది.

స్థల పరిశీలన పూర్తి

మరిన్ని మహిళా మార్ట్‌ల ఏర్పాటు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సబ్బవరం, కోటవురట్లలో స్థల పరిశీలన పూర్తయింది. మార్ట్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. చోడవరంలో స్థల పరిశీలన చేస్తున్నారు. కార్పొరేట్ తరహా పెద్ద పెద్ద మాల్స్‌ని తలదన్నేలా.. వాటికంటే తక్కువ ధరకే నిత్యావసర సరకులు మహిళా మార్ట్‌ల ద్వారా అందిస్తున్నారు. ఈ మార్ట్‌లో సభ్యత్వం పొందిన పొదుపు గ్రూపు సభ్యులకు డోర్ డెలివరీ సదుపాయం కూడా కొత్తగా అందుబాటులోకి తీసుకురానున్నారు.

మార్కెట్ కంటే 10–20 శాతం తక్కువకే

బయట మార్కెట్ కంటే 10 నుంచి 20 శాతం వరకు తక్కువ ధరకే ఈ మార్ట్‌లో సరకులను విక్రయిస్తారు. నిత్యావసర సరకులు కూడా నేరుగా నాలుగు కంపెనీల నుంచి మార్కెట్ ధర కంటే తక్కువకే తీసుకొచ్చి ప్యాకింగ్ చేసి, విక్రయిస్తున్నారు. దీంతో పాటు డ్వాక్రా మహిళలు స్వయం ఉపాధిలో తయారు చేసిన వస్తువులను కూడా మార్ట్ సేకరించి, ప్రజలు కొనుగోలు చేసేందుకు వీలుగా ఇక్కడ అందుబాటులో ఉంచుతున్నారు. రైతులు పండించే పంటలను నేరుగా మార్ట్ ద్వారా కొనుగోలు చేసి వాటిని ప్రాసెసింగ్ చేసి, విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. నిర్వహణ వ్యయం మినహా.. వచ్చిన లాభాలను సభ్యత్వం పొందిన మహిళలకు పంచుతారు.

రూ.11.30 లక్షల విక్రయాలు

మాడుగుల మండలంలో 1,865 మంది పొదుపు మహిళలు సుమారు రూ.35 లక్షల పెట్టుబడితో ఈ మహిళా మార్ట్‌ని ఏర్పాటు చేశారు. డిసెంబర్ 9 నుంచి ఇప్పటి వరకు రూ.11.30 లక్షల సరకు విక్రయాలు జరిగాయి. ఒక్కో సభ్యురాలి నుంచి రూ.210 చొప్పున సభ్యత్వం వసూలు చేశారు. వీటితో పాటు గ్రామ సమాఖ్య, మండల సమాఖ్యల ద్వారా సుమారు రూ.35 లక్షలు మహిళా మార్ట్‌కు వెచ్చించారు. మార్ట్‌లో అన్ని రకాల నిత్యావసర సరకులు విక్రయించనున్నారు. కార్పొరేట్ కంపెనీలు నిర్వహిస్తున్న పెద్ద మాల్స్ మాదిరిగా వీటిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మహిళా మార్ట్స్‌లో పని చేసే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చేయూత మండల సమాఖ్య కమిటీని ఏర్పాటు చేసి వారి ద్వారా మార్ట్ నిర్వహిస్తున్నారు.

జిల్లాలో సంఘాలు, సభ్యత్వం

జిల్లాలో 1,279 గ్రామ సంఘాలు

39,671 స్వయం సహాయక సంఘాలు

4,34,320 స్వయం సహాయక సభ్యులు



అందుబాటులో నాణ్యమైన సరకులు



మహిళా మార్ట్ ద్వారా నాణ్యమైన సరకులు అందిస్తున్నాం. నాణ్యతతో పాటు మార్కెట్ కంటే తక్కువ ధరకే మార్ట్‌లో సరకులు దొరుకుతాయి. సభ్యత్వం ఉన్న వారికి డోర్ డెలివరీ విధానాన్ని కూడా త్వరలో అమలు చేయనున్నాం. వినియోగదారులను మరింత ఆకర్షించేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నాం.

– అడపా అరుణ, మార్ట్ అధ్యక్షురాలు, మాడుగుల

మహిళా స్వావలంబన ప్రభుత్వ విధానం



పేదలకు తక్కువ ధరకే, నాణ్యమైన నిత్యావసర సరకులు అందించడం ప్రభుత్వ ధ్యేయం. మహిళా మార్ట్‌లను జిల్లాలో విస్తృతం చేసే దిశగా సన్నాహాలు చేస్తున్నాం. మహిళలకు ఇప్పటికే ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా అండగా ఉంది. ఈ మహిళా మార్ట్‌ల ద్వారా పేదలకు మరింత ప్రయోజనం చేకూరుతుంది.

– లక్ష్మీపతి, పీడీ, డీఆర్డీఏ

రిపబ్లిక్ డేకి నలుగురు ఖైదీల విడుదల?

ఆరిలోవ: గణతంత్ర దినోత్సవానికి నలుగురు జీవిత ఖైదీలు విడుదలకానున్నట్లు తెలిసింది. సాధారణంగా గాంధీ జయంతి, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఖైదీలు క్షమాభిక్షపై విడుదలవుతుంటారు. గత ఏడాది నుంచి గణతంత్ర దినోత్సవానికి అమృత్ కా ఆజాద్‌లో భాగంగా తక్కువ శిక్ష పడినవారిలో సత్ప్రవర్తన కలిగినవారిని విడుదల చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల ఏడుగురు ఖైదీల జాబితాను ఇక్కడ జైల్ అధికారులు ఉన్నతాధికారులకు పంపించారు. ఆ జాబితాలో ఒకరిని అనర్హుడిగా ఉన్నతాధికారులు గుర్తించారు. మిగిలిన ఆరుగురిలో ఇద్దరికి ఇటీవల బెయిల్ లభించడటంతో విడుదలయ్యారు. మిగతా నలుగురు ఖైదీలు అమృత్ కా ఆజాద్‌లో భాగంగా విడుదలకు అవకాశం ఉన్నట్లు సమాచారం. వారిని ఈనెల 26న విడుదల చేసే అవకాశం ఉంది.

హిందూ సంప్రదాయాన్ని చాటిచెబుదాం

- కంచి కామకోటి పీఠాధిపతి



శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం

సీతంపేట: హిందూ సంప్రదాయాలు చాటిచెప్పేలా దేవదాయ శాఖ అధికారులు ఉత్సవాలు నిర్వహించాలని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. శంకరమఠంలో ఆదివారం దేవదాయ శాఖ జిల్లా అధికారులతో జరిగిన కార్యక్రమంలో ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఆలయాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కాగా.. మాఘమాసం ప్రారంభం కావడంతో సూర్యనారాయణమూర్తికి భక్తులు సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం సహస్ర గాయత్రి మంత్ర జపం, దంపతులచే గాయత్రి మాత పూజ నిర్వహించారు. శంకరమఠం కార్యవర్గం కార్యక్రమాలను పర్యవేక్షించింది.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష

- 93.9 శాతం మంది అభ్యర్థుల హాజరు
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఎస్పీ



మాకవరపాలెంలోని అవంతి కళాశాల కేంద్రంలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

జిల్లాలో పరీక్ష కేంద్రాలు	21
దరఖాస్తు చేసిన అభ్యర్థులు	9,897
పరీక్ష రాసినవారు	9,297



అనకాపల్లిలో పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసు అధికారి



అనకాపల్లి డైట్ కళాశాల ప్రధాన ద్వారం వద్ద బారులు దీరిన అభ్యర్థులు.. ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి సాలి

అనకాపల్లి టౌన్: జిల్లాలో కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంత వాతావరణంలో జరిగింది. మొత్తం 21 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సజావుగా సాగింది. 9,897 మంది అభ్యర్థులకు 9,297 మంది హాజరయ్యారు. 93.9 శాతంమంది పరీక్ష రాశారు. అనకాపల్లి పట్టణంలో 11, చోడవరంలో 5, మునగపాక మండలంలో 2, మాకవరపాలెంలో ఒకటి, అచ్యుతాపురం మండలంలో 2 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. శనివారం సాయంత్రానికే పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. పరీక్ష కేంద్రాల వద్ద రద్దీపై దృష్టి సారించిన పోలీసు శాఖ 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేసింది. పరీక్ష నిర్వహణకు అడిషనల్ ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. నలుగురు డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ గౌతమి సాలి అనకాపల్లిలోని పరీక్ష కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీసుల సేవలకు ప్రశంసలు

చోడవరం: పెద్ద ఎత్తున కానిస్టేబుళ్ల భర్తీకి నిర్వహిస్తున్న పరీక్ష కావడంతో జిల్లా అంతటా వేలాది మంది అభ్యర్థులు హాజరయ్యారు. 'ఒక నిమిషం ' నిబంధన విధించడంతో ఆలస్యంగా వచ్చిన వారు పరుగు పరుగున పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వారిని సకాలానికి సెంటర్‌కు చేర్చేందుకు చోడవరం పోలీసులు విశేష కృషి చేశారు. వారు అందించిన సహకారం అందరి మన్ననలు పొందింది. చోడవరంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో 1810మంది పరీక్షలు రాసేందుకు ఏర్పాటు చేశారు. మారుమూల గ్రామాల నుంచి ఎందరో అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ అభ్యర్థులకు ఎంతో సహాయం అందించింది. పరీక్షా కేంద్రాల వద్ద జెరాక్స్‌లు, ఇతర సేవలు అందించడంతోపాటు పరీక్ష కేంద్రాలకు వారిని చేరవేసి ప్రశంసలు అందుకున్నారు. చోడవరం బస్టాండ్, ఆటో స్టాండ్‌లో దిగిన అభ్యర్థులు కాలినడక పరీక్ష కేంద్రాలకు వెళ్లారు. కొందరు ఆలస్యం కావడంతో పరుగులు తీశారు. ఆ సమయంలో చోడవరం పోలీసులు మేమున్నామంటూ... ప్రత్యక్షమయ్యారు. ఆయా రూట్లలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు తమ మోటారు సైకిళ్లపై వారిని ఎక్కించుకొని పరీక్ష కేంద్రాలకు చేరవేశారు. హెల్ప్‌డెస్కులోని హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, మహిళా కానిస్టేబుల్ కె.సుభాషిణి, హోమ్‌గార్డు టి.వి.జగన్నాథం కీలక పాత్ర పోషించారు.



చోడవరంలో అభ్యర్థిని మోటారు సైకిల్‌పై పరీక్ష కేంద్రానికి చేరవేస్తున్న హెచ్‌సీ వెంకట్రావు

వెయిటేజ్ కోసం నకిలీ సర్టిఫికెట్లు?

- కోవిడ్ నకిలీ సర్వీస్ సర్టిఫికెట్ల సమర్పణ
- స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీలో వెలుగుచూస్తున్న అక్రమాలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సు పోస్టుల కోసం కొంత మంది అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి.. ఉద్యోగం పొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పలు పోస్టుల భర్తీలో పలువురు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి.. ఉద్యోగాలు పొంది తర్వాత కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం ఇంకా తేలకముందే.. స్టాఫ్ నర్సు పోస్టుల్లో కూడా నకిలీల బెడద ఉన్నట్లు తెలిసింది. వెయిటేజ్ మార్కుల కోసం కొంత మంది నకిలీ కోవిడ్ సర్టిఫికెట్లు సమర్పించినట్టు సమాచారం. ఈ సర్టిఫికెట్లు సమర్పించిన అభ్యర్థుల నుంచి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

కోవిడ్ కాలంలో పనిచేసిన నర్సులకు ప్రభుత్వం 15 వెయిటేజ్ మార్కులు కలిపే అవకాశం కల్పించింది. దీంతో అభ్యర్థులు దరఖాస్తుతో పాటు కోవిడ్ సమయంలో వివిధ ఆస్పత్రుల్లో ఏడాది కాలం పాటు పని చేసినట్టు సర్టిఫికెట్లు సమర్పించారు. దీని వల్ల అనర్హులు ఎంపిక అయ్యారన్న వాదన బలంగా వినిపిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి ఎక్కువగా నకిలీ సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిసింది. స్టాఫ్ నర్సుల భర్తీ ప్రక్రియలో భాగంగా 100 మార్కులకు ఎంపిక విధానం ఉండగా.. అందులో 75 మార్కులు విద్యార్హతలు, నర్సింగ్ విద్యకు కేటాయించారు. ఉత్తీర్ణత పొందిన ఏడాదికి ఒక మార్కు చొప్పున అభ్యర్థికి 10 మార్కుల వరకు ఇవ్వవచ్చు. కోవిడ్ సమయంలో ఆరు నెలల కాలం పనిచేస్తే 5 మార్కులు, ఏడాది కాలం పనిచేస్తే 10 మార్కులు, 18 నెలల కాలం పనిచేస్తే 15 మార్కులు వెయిటేజ్ ఇచ్చారు. దీనిని కొంత మంది అభ్యర్థులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. తక్కువ కాలం పనిచేసినా ఏడాది, 18 నెలల కాలం పాటు పనిచేసినట్టు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి.. దరఖాస్తుకు జత చేసినట్లు తెలిసింది. సర్వీస్ కాలం దిద్దడం లేదా వెనుక తేదీతో పనిచేసినట్లు సర్టిఫికెట్లు సృష్టించడం వంటి చర్యలకు దిగినట్లు సమాచారం. దీనిని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆసరాగా తీసుకుని ఎంపిక జాబితాలో అనర్హులకు చోటు కల్పించారు. అవసరం అయిన వారికి వెయిటేజ్ మార్కులు కలపకపోవడం, ఎలాంటి అర్హతలు లేని వారికి మార్కులు కలిపి అందలం ఎక్కించినట్లు సమాచారం. ఉద్యోగులు, ఎంపికైన కొంత మంది అభ్యర్థుల చర్యల వల్ల తమకు అర్హత ఉన్నా.. ఉద్యోగాలు రాలేదని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. 179 పోస్టులకు గానూ 172 మందితో అధికారులు జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. అందులో 136 మంది కౌన్సెలింగ్‌కు హాజరు కాగా.. 8 మంది ఉద్యోగంలో చేరేందుకు అయిష్టత చూపారు. 36 పోస్టులు వివిధ కారణాల వల్ల భర్తీ కాలేదు.

ఆ వివరాలు డీఎంహెచ్‌వోలకే తెలుస్తాయి

నకిలీ సర్టిఫికెట్ల అంశం నా దృష్టికి రాలేదు. ఒకవేళ నకిలీ సర్టిఫికెట్లు వచ్చి ఉంటే.. వాటి గురించి మాకు తెలియదు. కోవిడ్ సమయంలో ఎంత కాలం పనిచేశారో అన్న వివరాలు డీఎంహెచ్‌వోలకే తెలుస్తాయి. పనిచేసిన కాలానికి డీఎంహెచ్‌వోల ద్వారా వారికి జీతాలు చెల్లించారు. ఎంపికైన స్టాఫ్ నర్సుల వివరాలు డీఎంహెచ్‌వోలకు పంపిస్తాం. అన్ని అంశాలు పరిశీలన చేసి తర్వాతే వారిని విధుల్లోకి చేర్చుకోవాలి.

– డాక్టర్ ఉమా సుందరి, ప్రాంతీయ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ

ఐటీకి ఊపు

ఐటీ రంగం అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఐటీ, ఐటీ ఆధారిత రంగాల్లో దిగ్గజ సంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభిస్తుండగా.. మరిన్ని కంపెనీలకు ఎర్ర తివాచీ పరిచేందుకు ప్రభుత్వం కార్యచరణ రూపొందించింది. రెండు రోజుల క్రితం నిర్వహించిన ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్-2023 సదస్సులో ఐటీ రంగం అభివృద్ధికి విశాఖలో ఉన్న అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ చేయడంతో.. మరిన్ని సంస్థలు ఇటుగా అడుగులు వేసేందుకు ఎదురు చూస్తున్నాయి.

- విశాఖ సమీపంలో ఐటీపార్క్
- భోగాపురం వద్ద 90.10 ఎకరాల్లో అభివృద్ధి
- అందుబాటులో 1.90 లక్షల చ.అడుగుల విస్తీర్ణం
- త్వరలో మరికొన్ని ఐటీ సంస్థల కార్యకలాపాలు



ఐటీ పార్క్ రానున్న కంచేరుపాలెం ప్రాంతం

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరాన్ని ఐటీ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి క్రమంగా ఫలిస్తోంది. ఐటీ, దాని ఆధారిత పరిశ్రమలైన ఇన్ఫోసిస్, డబ్ల్యూఎన్ఎస్, రాన్‌స్టాండ్ సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించగా.. అమెజాన్, విప్రో, ఐబీఎం సంస్థలు త్వరలోనే వైజాగ్‌లో అడుగు పెట్టనున్నాయి. మరిన్ని సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం పలికిన వేళ... ఆయా సంస్థలకు అవసరమైన మౌలిక వసతులు, వనరులు సిద్ధం చేసేందుకు కొత్త ఐటీ పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు తయారయ్యాయి. ఇప్పటికే మధురవాడలోని ఐటీహిల్స్‌లో పదుల సంఖ్యలో పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. దీనికి అనుబంధంగా మరో ఐటీ హబ్ విశాఖకు సమీపంలో సిద్ధంకానుంది.

భోగాపురం వద్ద 90.10 ఎకరాల్లో...

ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక హబ్‌ని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం విశాఖ నగరానికి సమీపంలో ఉన్న భూమిని గుర్తించింది. భోగాపురం సమీపంలోని కంచేరుపాలెంలోని సర్వే నం.1లో 90.10 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ పార్క్ ఏర్పాటు కానుంది. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు 53 కి.మీ, విజయనగరం రైల్వే స్టేషన్‌కు 32 కి.మీ దూరంలోనూ, ఎన్‌హెచ్-16కు 9 కి.మీ దూరంలో ఈ పార్క్ రాబోతోంది. ప్రతిపాదిత భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో వస్తున్న ఐటీ పార్క్‌కు కావల్సిన పూర్తి వనరులు, వసతులు అందుబాటులోనే ఉన్నాయి. ఈ స్థల అభివృద్ధికి కార్యచరణ రూపుదిద్దుకుంటోంది.



మిలీనియం టవర్స్

ఐటీ హిల్స్‌లోనూ అందుబాటులో స్థలం

ఓవైపు ప్రత్యేక ఐటీ పార్క్ అభివృద్ధికి శ్రీకారం చుడుతుండగా.. ప్రస్తుతం ఉన్న మధురవాడ ఐటీ హిల్స్‌లోనూ వెంటనే సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన స్థలం కూడా అందుబాటులో ఉంది. 1.90 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఆఫీస్ స్పేస్ కూడా సిద్ధం చేస్తున్నట్లు అధికారులు సంస్థలకు తెలిపారు. ఇందుకోసం మరో 1.20 లక్షల పార్కింగ్ స్థలం కూడా అందుబాటులో ఉంది. ఇక్కడ ఉన్న అవకాశాల్ని వినియోగించుకోవాలంటూ ప్రధాన ఐటీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాసింది. విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించాలని ఆహ్వానాలు అందించింది.

విశాఖలోనే ఐటీ రంగం భవిష్యత్తు



ఉద్యోగులు ఉన్న చోటికే సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించే సంస్కృతి ఐటీ రంగంలో మొదలైంది. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉత్తరాంధ్ర పరిసర ప్రాంతాల్లోనే ఉన్నారు. అంటే.. విశాఖలోనే ఐటీ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించే ఆస్కారం ఉంది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఐటీ పార్క్‌ని కూడా భోగాపురం వద్ద సిద్ధం చేయడం శుభపరిణామం. ఇవన్నీ పూర్తయితే కొత్త కంపెనీలు వచ్చేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒక్కో పరిశ్రమ అడుగులు వేస్తే.. విశాఖలోనే ఐటీ రంగం భవిష్యత్తు ఉంటుందనేది వాస్తవం.

– శ్రీధర్ కొసరాజు, ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

మోదకొండమ్మ ఆలయానికి రూ. 60 వేల విరాళం



చైర్మన్ అప్పలరాజుకు విరాళం అందజేస్తున్న పండా బుజ్జి కుటుంబం

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మకు గ్రామానికి చెందిన భక్తులు పండా బుజ్జి, సుజాత దంపతులు ఆదివారం బంగారు ఆభరణాల నిమిత్తం రూ.60 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పండా బుజ్జి కుమారులు, కోడళ్ల సురేష్, సుజాత, నాగేంద్ర కుమార్, శ్రీవిద్య, సుదీర్, శ్యామల దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



వైఎస్సార్ టీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తారువలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని యూనియన్ నేతలు తెలిపారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బాదిరెడ్డి గంగాధర్, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగలి మంగునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.సంధ్యారాణి, స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తదితరులున్నారు.

డ్రోన్లతో వ్యవసాయం

- మందుల పిచికారీకి వినియోగం
- జిల్లాకు పది కేటాయింపు
- ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ



పంటకు క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

నర్సీపట్నం: సాగులో ప్రభుత్వం సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చింది. క్రమేపీ కూలీల కొరతను అధికమించేందుకు యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. తాజాగా పంటలకు క్రిమిసంహారక మందుల పిచికారీకి డ్రోన్లను వినియోగించేలా చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి అనకాపల్లి జిల్లాకు పది డ్రోన్లను కేటాయించింది. వాటిని కస్టమర్ హైరింగ్ సెంటర్‌కు అనుసంధానంగా అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. డ్రోన్ల వినియోగంపై ప్రభుత్వమే శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేసింది. డ్రోన్ల యూనిట్‌కు దరఖాస్తు చేసుకున్న ఇద్దరు రైతులకు శిక్షణ ఇప్పించారు.

జిల్లాలో గత ఖరీఫ్‌లో 89,510 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేశారు. దీనిలో వరి 54,766 హెక్టార్లు, ఇతర పంటలు 34,744 హెక్టార్లు ఉంది. వీటితోపాటు ఉద్యానవన పంటలు జీడిమామిడి, మామిడిని ప్రధానంగా సాగు చేస్తున్నారు. మెట్ట భూములతోపాటు కొండ ప్రాంతాల్లో వీటిని సాగు చేయడం వల్ల దీని విస్తీర్ణం లక్ష హెక్టార్లకు పైగా ఉంది. ఈ విధంగా చూస్తే దాదాపుగా లక్షా 90 వేల హెక్టార్లలో ఏటా అన్ని రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందుకోసం రైతులకు దుక్కి నుంచి పంట చేతికి వచ్చే వరకు వివిధ దశల్లో కూలీల అవసరం ఉంది. గతంతో పోలిస్తే గ్రామాల్లో కూలీల సంఖ్య తగ్గుతూ వస్తోంది. నిత్యం ఉపాధి హామీ పనులుండటంతో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో వ్యవసాయానికి కూలీల కొరత వేధిస్తోంది. దీనిని అధికమించేందుకు కొన్నాళ్లుగా ప్రభుత్వాలు సాంకేతికతను రైతుల దగ్గరకు చేరుస్తున్నాయి. ఎడ్లతో చేసే పనిస్థాయిలో ట్రాక్టర్లు వినియోగం, కలుపు తీసేందుకు సైకిల్ వీడర్ వంటి వివిధ రకాల సామగ్రి, పురుగు మందుల పిచికారీకి స్ప్రేయర్లు, దమ్ము చేసే సమయంలో యంత్రాలు విరివిగా వినియోగిస్తున్నారు.

రాయితీపై యంత్రాలు

వ్యవసాయంలో అవసరమైన యంత్రాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం రైతులకు రాయితీ అందిస్తోంది. దీనివల్ల ఎక్కువ మంది వీటిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. వివిధ స్థాయిలో యాంత్రీకరణ పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వం ఇటీవల కొత్తగా పంటపై వివిధ రకాల మందులు, ఎరువులను పిచికారీ చేసేందుకు డ్రోన్లను వినియోగించే విధంగా చర్యలు చేపడుతోంది. వీటిని చదువుకున్న రైతులకు అందించేందుకు నిర్ణయం తీసుకుంది. పదో తరగతి చదివి, భూమి తన పేరు మీద ఉన్న వారికి రాయితీపై అందిస్తోంది. కస్టమర్ హైరింగ్ సెంటర్ ద్వారా అవసరమైన రైతులకు డ్రోన్లను అద్దె ప్రాతిపదికన అందించనున్నారు.

రాయితీపై డ్రోన్లు...



ఆసక్తి కలిగిన రైతులకు ప్రభుత్వం రాయితీపై డ్రోన్లు మంజూరు చేస్తోంది. డ్రోన్లు పొందేందుకు ఇద్దరు రైతులు దరఖాస్తు చేస్తున్నారు. వీరికి డ్రోన్ల వినియోగంపై ఉచితంగా శిక్షణ ఇప్పించాం. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. 40 శాతం రాయితీ కల్పిస్తున్నాం. రైతులు సాంకేతికతను వినియోగించుని తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించవచ్చు.

– బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

సేవా కార్యక్రమాలతో శుభాకాంక్షలు



పార్టీ కార్యాలయంలో పేద మహిళకు దుప్పటి అందిస్తున్న కార్పొరేటర్లు సునీత, ప్రసన్నలక్ష్మి



మార్కెట్ కమిటీ కార్యాలయంలో పేద మహిళకు చీర అందిస్తున్న చైర్‌పర్సన్ పలకా యశోద

ఘనంగా మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు

అనకాపల్లి టౌన్: పట్టణంలో పలు చోట్ల ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ 39వ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక రింగ్‌రోడ్డు వద్ద వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణాధ్యక్షుడు జానకీరామరాజు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిండు నూరేళ్లు, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో కోరుతూ పూజలు చేశారు. అంతకుముందు 82, 83వ వార్డుల కార్పొరేటర్లు జాజుల ప్రసన్నలక్ష్మి, మందపాటి సునీత కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో కార్పొరేటర్లు జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్, మందపాటి సునీత, జానకీరామరాజు చిన్నారులకు బేబీ కిట్లు, గర్భిణులకు, రోగులకు రొట్టెలు, పండ్లు, పాల ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సీనియర్ నేత, వైద్యుడు జి.రామ్మూర్తి, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బెల్లం మార్కెట్‌యార్డులో...

స్థానిక బెల్లం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, రవి దంపతులు పేదలకు చీరలు పంపిణీ చేశారు. అంతకుముందు జన్మదిన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, డైరెక్టర్లు నీటిపల్లి లక్ష్మి, బొబ్బిలి శ్యామల, ఈగల నూకరత్నం, దాడి తులసి, లక్ష్మి, బొడ్డు అచ్చిరాజు పాల్గొన్నారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు జోసెఫ్ మంత్రి అమర్‌నాథ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉరివేసుకుని లారీ డ్రైవర్ ఆత్మహత్య!

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పరవాడ: దేశపాత్రునిపాలెంలో నివసిస్తున్న లారీ డ్రైవర్ దెందుకూరి శ్రీనివాసరాజు (40) సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు అందించిన వివరాలు... నక్కపల్లి మండలం వేంపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరాజు భార్య ఇద్దరు పిల్లలు, తల్లి అప్పలనర్సమ్మతో కలిసి దేశపాత్రునిపాలెంలో కొంత కాలం నుంచి నివాసం ఉంటున్నాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరాజు భార్యా పిల్లలతో శనివారం ఉదయం యారాడ బీచ్‌కు వెళ్లి సాయంత్రం 5.30 గంటలకు తిరిగి వచ్చారు. అనంతరం పనిచేస్తున్న ట్రాన్స్‌పోర్టు ఆఫీసుకు వెళ్లి రాత్రి ఇంటికి చేరుకున్నాడు. భోజనం చేసిన అనంతరం తన బెడ్ రూంలో పడుకోవడానికి వెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో శ్రీనివాసరాజు కుమారుడు తండ్రి పడుకొన్న గది తలుపుకొట్టాడు. లోపలి నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు తెరచిచూడగా బెడ్‌షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరిపోసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దింపి గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోకి కేజీహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడ పరీక్షలు జరిపిన వైద్యులు శ్రీనివాసరాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసరాజుకు అతని భార్యకు కొంత కాలం నుంచి మనస్పర్థలు ఉన్నాయని మృతుడు తల్లి అప్పలనర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసుగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వర్, ఉపాధ్యక్షుడు ఈగల శ్రీనివాసరావు తెలిపారు. అనకాపల్లి పట్టణంలో ఓ హోటల్‌లో ఆదివారం ఈ ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా మల్ల సూర్యనారాయణ, ప్రెసిడెంట్‌గా టి.వెంకటరమణ, కార్యదర్శిగా మైలపిల్లి శివ, సహాయ అధ్యక్షుడిగా కె.ఎర్రజీరావు, కోశాధికారిగా బి.సాయి, వైస్ ప్రెసిడెంట్లుగా కె.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా సీహెచ్.జ్యోతి, సి.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.సతీష్ ఎన్నికై నట్టు ఎన్నికల అధికారి టి.విజయానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వియ్యపు నాగయ్య, సహాయ ఎన్నికల అధికారి సుక్కు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దుస్తులకు సిగరెట్ అంటుకుని వృద్ధుడికి గాయాలు



కాలిపోయిన నాగేశ్వరరావును రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నర్సీపట్నం: మున్సిపాలిటీ శారదానగర్‌లోని ఎంవీఆర్ ప్లాజాలో జరిగిన అగ్నిప్రమాదంలో వి. నాగేశ్వరరావు(60) తీవ్రంగా గాయపడ్డాడు. ప్లాజాలోని మూడో అంతస్తులో నివసిస్తున్న అతడు శనివారం రాత్రి సిగరెట్ తాగుతూ నిద్రపోయాడు. ఈ క్రమంలో సిగరెట్ దుస్తులకు మంటలు అంటుకుని వ్యాపించాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు శరీరం, కాళ్లుతోపాటు ఇంట్లో సామగ్రి కాలిపోయాయి. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి స్వామి తెలిపారు.

అంతర్ జిల్లాల స్థాయి పోటీలో కాంస్య పతకం

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వై. జాషువా డేనియల్ వంద మీటర్ల హర్డల్స్ పోటీలో అంతర్ జిల్లాల స్థాయిలో కాంస్య పతకాన్ని సాధించాడు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2022–23 సంవత్సరానికి సంబంధించి ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన ఈ పోటీలో ప్రతిభ కనబరిచాడని హెచ్‌ఎం ఎ. శ్రీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. డేనియల్‌ను పీడీ వి. ప్రభాకరరావు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ బి. దీప, ఉపాధ్యాయులు బి.ఆనంద్, ఆచంట రవి, అప్పారావు, ఎ. నాగేశ్వరరావు, రామారావు, సుధారాణి అభినందించారు.



హర్డల్స్ పోటీలో కాంస్య పతకం పొందిన జాషువా డేనియల్

అవధులు లేని ఆనందం



కామేశ్వరమ్మ ఆలయం వద్ద కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 42 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ గడిపారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో 1980–81 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రాచపల్లి జంక్షన్ వద్ద కామేశ్వరమ్మ ఆలయం వద్ద ఆదివారం కలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారంతా ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా చిన్ననాటి తీపి గురుతులను గుర్తు చేసుకుని, ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అప్పటి ఎస్పీఎల్ కోమాకుల మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ డిప్యూటీ కలెక్టర్ మోహన్‌రావుతోపాటు ఎనిమిది మందిని సత్కరించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 30 మంది పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు



ఏజెన్సీ అందాలను తలదన్నేలా ఆదివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. పది రోజులుగా మంచు కురవకపోవడంతో చలి తగ్గింది. వేసవి వచ్చేస్తోందని అందరూ అనుకుంటున్న దశలో మళ్లీ పొగమంచు ప్రత్యక్షమైంది. బుచ్చెయ్యపేటలో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగించారు. పలువురు ప్రకృతి ప్రియులు మంచు అందాలను సెల్‌ఫోన్‌లో బంధించి తన్మయం చెందారు. – బుచ్చెయ్యపేట

అత్యున్నత ప్రమాణాలకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్య సభ్యులు సి.హెచ్ చౌదరి, సతీష్‌రెడ్డి

యలమంచిలి: హెల్త్ ఎన్విరాన్మెంట్, సేఫ్టీ విభాగంలో అత్యున్నత ప్రమాణాలు పాటించినందుకుగాను 2023వ సంవత్సరానికి గ్రీన్ టెక్ అంతర్జాతీయ పురస్కారం లభించిదని యలమంచిలి మండలం ములకాలాపల్లి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వి.హెచ్ చౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన గ్రీన్ టెక్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ భరత్‌పాఢక్, నేషనల్ కన్వీనర్ గంగవిచార్‌మంచ్, నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగ నుంచి ఈ నెల 19న గోవాలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ వి.హెచ్ చౌదరి, సేఫ్టీ విభాగం హెడ్ సతీష్‌రెడ్డి అవార్డు అందుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులు, కార్మికుల కృషి ఫలితంగా ఈ అవార్డు వచ్చిందని, మెరుగైన పనితీరుతో కంపెనీ ఉత్పత్తులు పెంచి భద్రతా ప్రమాణాలుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, మరిన్ని విజయాలు సొంతం చేసుకుంటామని తెలిపారు.

చక్కనైన సర్దుబాటు..!

- తీరిన సబ్జెక్టు టీచర్ల కొరత
- అర్హతలకు అదనపు ప్రోత్సాహకం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 733 మందికి లబ్ధి
- కొత్త స్థానాల్లో నేటి నుంచి విధులు



హైస్కూల్‌లో విద్యార్థులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయురాలు

విశాఖ విద్య: ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీరింది. అర్హత గల సెకండరీ గ్రేడ్(ఎస్జీటీ) టీచర్లకు స్కూల్ అసిస్టెంట్ హోదా కలిస్తూ, వారిని హైస్కూళ్లలో తాత్కాలికంగా సర్దుబాటు చేశారు. కొంతమంది అవకాశవాద చర్యలతో బదిలీలు, ఉద్యోగోన్నతులకు బ్రేక్ పడినప్పటికీ, ఉపాధ్యాయులకు మేలు చేయాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని 733 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు దీని వల్ల మేలు జరిగింది. సబ్జెక్టు టీచర్ల నియామకంతో హైస్కూళ్లలో విద్యార్థులకు బోధన మెరుగుపడనుంది. సర్దుబాటు ద్వారా పనిచేసే ఉపాధ్యాయులకు సైతం నెలకు రూ.2,500లు అదనపు ప్రోత్సాహకం లభించనుంది. అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉండేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతుంది.

సబ్జెక్టుల వారీగా సర్దుబాటు ఇలా..

గణితం–142, ఫిజికల్ సైన్స్–94, బయోలాజికల్ సైన్స్–71, సోషల్ సైన్స్–104, ఇంగ్లిష్–33, తెలుగు–51, హిందీ–44తో పాటు సబ్జెక్టు కన్వెర్షన్ కింద మరో పది పోస్టుల్లో సర్దుబాటు ప్రాతిపదికన ఎస్జీటీలను హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్‌గా నియమించారు. వీరితోపాటు గత అక్టోబర్ నెలలో అంగీకార పత్రాలను తీసుకున్న వారిలో ఇంగ్లిష్–156, బయోలాజికల్ సైన్స్–28 మందికి అడహక్ ఉద్యోగోన్నతులు ఇచ్చారు. వీరంతా సోమవారం నుంచి కొత్త ప్రదేశాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరందరూ అదనంగా రూ.2,500లు అందుకోనున్నారు.

పారదర్శకంగా సర్దుబాటు



హైస్కూళ్లలో నైపుణ్యతతో కూడిన చదువులు సాగాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా అర్హత గల ఎస్జీటీలను సీనియార్టీ ప్రాతిపదికన హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లగా సర్దుబాటు చేశాం. సీనియార్టీ జాబితాలను ప్రదర్శించి, అందరికీ ఆమోదకరంగా పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించాం. పదో తరగతి పరీక్షల దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన ఇలాంటి ఏర్పాట్లు చేశాం.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

రెగ్యులర్ స్కేలు ఇస్తే మరింత మేలు



అర్హత గల ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ హోదాలో హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లుగా నియమించటం మంచి నిర్ణయమే. డీఈవో కార్యాలయ అధికారులు అంతా పారదర్శకంగానే సర్దుబాటు పక్రియ నిర్వహించారు. అయితే శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పిస్తే మరింత మేలు జరుగుతుంది.

–కొమ్మనాపల్లి నాగేశ్వరరావు, పీఆర్టీయూ కార్యదర్శి, విశాఖ జిల్లా

మంచి నిర్ణయమే..



హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు కొరత తీరేలా ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. సీనియార్టీ జాబితా ముందుగానే ప్రకటించింది. దీనివల్ల పారదర్శకత పెరిగింది. ఇది హర్షించదగ్గదే. అయితే ఉద్యోగోన్నతి కోసమని విల్లింగ్ తీసుకున్న వారికి రెగ్యులర్ స్కేల్ వర్తింప జేస్తే బాగుంటుంది.

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ, రాష్ట్ర కౌన్సిలర్

విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా..



ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులందరికి నెలవారీ ఉద్యోగోన్నతులు కల్పించాలనే కృతనిశ్చయంతో అధికారులు ముందుకెళ్తున్నా.. కావాలనే కొందరు అవాంతరాలు సృష్టిస్తూ వాటిని అడ్డుకుంటున్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని చేసిన ఇలాంటి సర్దుబాటు మంచి పరిణామం. హైస్కూళ్లలో బోధన మెరుగుపడుతుంది.

– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, ఉమ్మడి విశాఖ జిల్లా

క్లుప్తంగా

ఘనంగా తీర్థ మహోత్సవం



జి.భీమవరం తీర్థ మహోత్సవంలో మహిళల కోలాటం

కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామంలో ఆదివారం సాయంత్రం తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానికులతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా తిలకించారు. ఆట వస్తువులు, కూరగాయలు, వంట సామగ్రి, అలంకరణ వస్తువుల అమ్మకాలు జోరుగా సాగాయి. అక్కడి రామాలయాన్ని ప్రజలు దర్శించి పూజలు చేశారు. సర్పంచ్ వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు తదితరులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

'బెల్లంమార్కెట్' అధ్యక్షుడిగా పాలిమేర శివ అప్పారావు



ఎన్నికైన నూతన కార్యవర్గం

అనకాపల్లిటౌన్ : ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ కార్మిక సంఘం అధ్యక్షునిగా పాలిమేర శివ అప్పారావు(మనీ)ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా బుద్ద రాము, కోశాధికారిగా పాలిమేర వెంకట అప్పారావు, సహాయ ఉపాధ్యక్షునిగా కాండ్రేగుల నూక అప్పారావు, సహాయ కార్యదర్శిగా గొర్లె కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా గరిక వెంకటరావు, విల్లూరి రమణబాబు, కొణతాల త్రినాథ్ వ్యవహరించారు.

అక్కిరెడ్డిపాలెంలో 'గడప గడప'కు నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని అక్కిరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్యఅతిథిగా హాజరై, ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతోపాటు, స్థానికంగా ప్రజలు ఎదుర్కొనే సమస్యల్ని గుర్తిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు హాజరుకావాలని ఆయన కోరారు.

అంతర్జాతీయ చిరుధాన్యాల సదస్సు రేపు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 24న అంతర్జాతీయ చిరుధాన్యాల సదస్సు నిర్వహించనున్నట్టు శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ కార్యదర్శి జోగినాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సుకు నాబార్డు అధికారులు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
వాల్తేరు వీరయ్య	- సత్యనారాయణ స్క్రీన్-1
వీర సింహారెడ్డి	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డిసాయి
వారసుడు	- పర్తిసాయి
వీర సింహారెడ్డి	- వెంకటేశ్వర
వారసుడు	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 207 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 607 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వ 'మద్దతు'

- గతేడాది 66 టన్నులు, ఈ ఏడాది 91 టన్నుల లక్ష్యం
- ఫిబ్రవరి 15లోగా కొనుగోళ్ల లక్ష్యం పూర్తికి సన్నాహాలు



కశింకోట వద్ద పంట నూర్చి అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు



మడిలో ధాన్యం నూర్పిడికి సిద్ధంగా ఉన్న వరి కుప్ప

కశింకోట : రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించేందుకు మండల రైతాంగం ఆసక్తి చూపుతోంది. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రయివేటు వ్యక్తుల కంటే ఎక్కువగా ఉండటమే దీనికి కారణం. దీంతో ఎక్కువ విస్తీర్ణంలో పంట పండించిన రైతులు తమ వినియోగానికి దాచుకోగా మిగిలిన ధాన్యాన్ని విక్రయించడానికి సమాయత్తం అవుతున్నారు.

పెరిగిన సాగు, దిగుబడి

మండలంలో ఈ ఏడాది 1,144 హెక్టార్లలో వరి పంట వేశారు. గత ఏడాది 951 హెక్టార్లలో వరి వేశారు. గతేడాది కంటే 200 హెక్టార్లు అధికం. చెరకు సాగు వల్ల ఆశించిన ఆదాయం రాకపోవడంతో వరి పంట సాగు వైపు రైతులు మళ్లారు. మరోవైపు వాతావరణం కూడా అనుకూలించడంతో ఈ ఏడాది పంట బాగానే పండింది. చాలా వరకు నూర్పులు పూర్తి చేసి ధాన్యం సిద్ధం చేశారు. మరికొందరు నూర్పిడికి సన్నాహాలు చేస్తున్నారు. మండలంలో సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నారు. దీంతో వారిలో ఎక్కువ మంది ధాన్యాన్ని ఇంటి అవసరాలకు వినియోగిస్తారు. తక్కువ మంది అమ్మకానికి సిద్ధంగా ఉన్నారు.

ప్రభుత్వ 'మద్దతు'

ప్రభుత్వం తరపున రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే మేలు రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040 వంతున ధర చెల్లించనున్నట్లు ప్రకటించారు. అదే ప్రైవేటు వ్యక్తులు కేవలం రూ.1900 ధర చెల్లిస్తున్నారు. దీంతో ఎక్కువ ధర చెల్లించనున్న ప్రభుత్వానికి ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. కశింకోటలోని రైతు భరోసా కేంద్రంలో సంక్రాంతికి ముందు ధాన్యం కొనుగోళ్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. దీంతో కశింకోటతోపాటు మండల గ్రామాల నుంచి రైతులు ధాన్యాన్ని విక్రయించడం ఊపందుకుంది.

కొనుగోళ్ల లక్ష్యం చేరేలా..

గత ఏడాది 66 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ఏడాది 91 టన్నులు కొనుగోలు లక్ష్యంగా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఫిబ్రవరి 15లోగా లక్ష్యాన్ని చేరుకోవాలని భావిస్తున్నారు. సోమవారం నుంచి కల్లాల వద్దే ధాన్యం కొనుగోలుకు వ్యవసాయ అధికారులు సమాయత్తం అవుతున్నారు. ప్రయివేటు వ్యాపారులు తక్కువకు చెల్లించడం, తూకంలో తేడాలు చూపడం తదితర ఇబ్బందుల దృష్ట్యా.. ఆర్బీకేల ద్వారా విక్రయిస్తే రైతులకు చాలా మేలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

కొనుగోళ్లకు సన్నద్ధం

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. పలు గ్రామాల్లో రైతులు ధాన్యం విక్రయించడానికి ముందుకు వస్తున్నారు. వాటిని ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు మేరకు కొనేందుకు ఏర్పాట్లు చేశాం. రవాణా, గోనెల చార్జీని ప్రభుత్వమే భరించనుంది. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా నిర్ణీత ధర చెల్లించనున్నాం. ఫిబ్రవరి నెల 15లోగా ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని చేరుకోవడానికి కార్యాచరణ సిద్ధం చేశాం.

-ఎం.స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరిస్తే చేటు



శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత రామారావు

పరవాడ: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను నిలిపివేస్తూ నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ నేత ఎస్.రామారావు డిమాండ్ చేశారు. 79 వార్డు దేశపాత్రునిపాలెంలో అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షా శిబిరంలో అఖిల పక్ష నాయకులు ఎస్.రామారావు, పి.గంగారం, ఆర్.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, బి.వెంకటరావు, రామ్మోహన్‌కుమార్, గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థ ఉక్కు కర్మాగారాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తే సహించబోమని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తోందని విమర్శించారు. ఉక్కునగరంలో ఈ నెల 30న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. శిబిరంలో పి.మాణిక్యం, పి.డి.నాయుడు, శివ, రాధాకృష్ణ, భాస్కరరావు, పరమేశ్వరి, రామారావు, రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు

1 నుంచి 5 వరకు దేవీతల్లి తీర్థం



ఆలయంలో సమావేశమైన గ్రామ పెద్దలు

దేవరాపల్లి: స్థానిక ప్రజల ఆరాధ్య దైవం ఉమామహేశ్వరి దేవి (దేవీతల్లి) తీర్థం వచ్చే నెల 1 నుంచి 5వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు ఆలయంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐదు రోజులు పాటు జరిగే తీర్థం సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుపై చర్చించారు. ఆఖరి రోజు 5న భారీ సంఖ్యలో హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు లేకుండా చేయాల్సిన ఏర్పాట్లుపై సైతం సమాలోచనలు చేశారు. సమావేశంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కల్లుగీత డైరెక్టర్ సిమ్మ అప్పన్న, వరదపురెడ్డి లలితానాయుడు, ఎల్లేటి కరుణాకరరావు, ఆలయ ధర్మకర్త లలితా ప్రసాద్, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, వేచలపు అప్పలనాయుడు, పేరునాయుడు, వాలేటి నాగరాజు, కె.వి.రమణ పాల్గొన్నారు.

నేడు సుభాష్ చంద్రబోస్ తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సోమవారం తీర్థం నిర్వహిస్తున్నట్లు నేతాజీ సోల్జర్స్ (2007-2008) బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఇక్కడ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఉదయం జెండా వందనం, దేశభక్తి గీతాలు ఆలాపన ఉంటుందన్నారు. అనంతరం సాయంత్రం ముగ్గులు, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష ప్రశాంతం

- పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఎస్పీ గౌతమి సాలి



డైట్ కళాశాల వద్ద అభ్యర్థుల తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి సాలి

అనకాపల్లిటౌన్ : పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష పట్టణంలోని 11 కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ గౌతమి సాలి పర్యవేక్షించారు. అభ్యర్థుల హాల్‌టిక్కెట్లు, గుర్తింపు కార్డులు స్వయంగా పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఏపీఎస్ఎల్ఆర్బీ నియమ నిబంధనల ప్రకారం పరీక్షలను నిర్వహించాల్సిందిగా ఇన్విజిలేటర్లకు, పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5,307 మంది హాజరు కావాల్సి ఉండగా 5,005 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. 302 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. శ్రీచైతన్య స్కూల్లో జరిగిన పరీక్షలకు అడిషనల్ ఎస్పీ(పరిపాలన)బి.విజయభాస్కర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. సంయుక్త, భాష్యం, హిమశేఖర్-2, సిటీ పబ్లిక్ స్కూల్, దాడి వీరునాయుడు, ఏఎంఏఎల్ హైస్కూల్, సర్వేపల్లి కేంద్రాల్లో కానిస్టేబుల్ పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రాల పరిశీలనలో డీఎస్పీ బి.సునీల్, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం



బాణసంచా విన్యాసాలు



ఆర్కెస్ట్రాలో పాటలు పాడుతున్న సింగర్లు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం అర్ధరాత్రి దాటిన వరకు జరిగి, ఘనంగా ముగిసింది. అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలు జాతరకు వచ్చిన ప్రజలను ఆకట్టుకున్నాయి. శారదానది వంతెన నుంచి పెరుగులబజారు కూడలి వరకు ప్రధాన రహదారి జనంతో కిక్కిరిసింది. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలు ఆకర్షించాయి. పట్టణ సీఐ దాడి మోహన్ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించాయి.

మంత్రి అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు



మంత్రి అమర్‌నాథ్‌కు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందిస్తున్న బొడ్డేడ శివ

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా తన పదవీ కాలాన్ని పొడిగించినందుకు బొడ్డేడ శివ రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మద్దాల సురేష్, విల్లూరి తాతీలు, క్రాంతికుమార్, సతీష్ పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు



మంత్రి అమర్‌నాథ్ జన్మదినం సందర్భంగా తుమ్మపాలలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



రక్తదానం చేసిన యువకుడికి సర్టిఫికెట్ అందిస్తున్న బొడ్డేడ ప్రసాద్, గొర్లి సూరిబాబు



మంత్రి అమర్‌నాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మళ్ల బుల్లిబాబు, పార్టీ నాయకులు

అనకాపల్లిటౌన్ : మండలంలోని గోపాలపురం గ్రామంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. జన్మదిన కేక్‌ను ఎంపీపీ గొర్లి సూరిబాబు కట్ చేసి కార్యకర్తలు, నాయకులకు పంపిణీ చేశారు. 50 మంది యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. రక్తదానం చేసిన యువతకు ఎంపీపీ సూరిబాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌లు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట : మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమానులు ఆదివారం మింది తరలి వెళ్లి మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, కశింకోట సర్పంచ్ మంత్రి జయరజని, వైఎస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మలసాల కిషోర్, ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, పార్టీ యువజన విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ పూలమాలలు వేసి దుశ్శాలువాలు కప్పి జ్ఞాపికలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అనకాపల్లి రూరల్ : రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు ఆదివారం తుమ్మపాల మేజర్ పంచాయతీలో జరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, సర్పంచ్ తట్టా పెంట్యనాయుడు, పలువురు పార్టీ నేతల సమక్షంలో కేక్ కట్ చేసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలో అనకాపల్లి మండల పరిషత్ వైస్ చైర్మన్ విల్లూరి సూరికుమారి, విల్లూరి శేఖర్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పీడీ గాంధీ, గ్రామ ఉప సర్పంచ్ మగసాల లక్ష్మి, మగసాల వెంకట్, దంతులూరి కల్యాణ చక్రవర్తి, సీనియర్ న్యాయవాది పిల్లా హర శ్రీనివాసరావు, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, పన్నీరు చంటి, పడాల గణపతి, రైతు సంఘం నాయకులు పీలా బుజ్జి, వార్డు మెంబర్లు రవ్వ భవానీ, చదరం చిన్నా, సత్యారావు, రామారావు, వెలగా మోదినాయుడు, కొణతాల అర్జునాయుడు, ఆడారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాల్లో నలుగురి అరెస్ట్

అనకాపల్లిటౌన్ : మండలంలోని అక్కిరెడ్డిపాలెం గ్రామ శివారున ఆదివారం కోడి పందాలాడుతున్న శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ నరసింగరావు చెప్పారు. వారి నుంచి మూడు కోళ్లు, రూ.400 నగదును స్వాధీనపరచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా పేకాట, కోడి పందాలు తదితర జూదంలో పాల్గొన్నా.. ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామ శివారు మామిడి తోటలో ఆదివారం కోడి పందాలు ఆడుతుండగా తమ సిబ్బందితో దాడి చేసి ఇద్దరిని పట్టుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎ. ఆదినారాయణ రెడ్డి తెలిపారు. ఈ దాడిలో వారి నుంచి రూ.1,130 నగదు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మామిడిలో అంతర పంటగా టమాటా

కె.కోటపాడు: మండలంలోని మెట్ట గ్రామాల్లో రైతులు అంతర పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా రైతులు అధిక విస్తీర్ణంలో మామిడి సాగు చేపడుతున్నారు. ఈ పంట ఖాళీ ప్రదేశాల్లో అంతర పంటగా కూరగాయలతోపాటు ఆకుకూరలను సాగు చేస్తున్నారు. తక్కువ కాల వ్యవధిలో, తక్కువ పెట్టుబడితో సాగయ్యే టమాటా పంటను పాతవలస, గొట్లాం, సూదివలస, శృంగవరం, మర్రివలస ప్రాంతాల్లో 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మామిడితోపాటు అంతర పంటగా టమాటా సాగు చేయడం వల్ల అదనపు ఆదాయాన్ని సాధిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

275 మందికి కంటి పరీక్షలు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 275 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 202 మందికి కళ్లద్దాలు, 44 మందికి మందులు పంపిణీ చేశారు. 19 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కల్పించారు. ప్రజల ఆరోగ్యానికి అండగా ఉండాలనే లక్ష్యంతో ఇటువంటి శిబిరాలను నిర్వహిస్తున్నామని, ఆదివారం 99వ శిబిరం నిర్వహించామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు.

అ'పూర్వ' కలయిక



చిన్నహైస్కూల్ 1989-90 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు

తుమ్మపాల : జీవీఎంసీ గవరపాలెం చిన్నహైస్కూల్ 1989-90 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం బొజ్జన్నకొండ వద్ద జరిగింది. 33 సంవత్సరాలు తర్వాత కలవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. వారి వారి వృత్తులు, వ్యాపారాలు, కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో చేసిన కొందరి అల్లరిని చెప్పుకుంటూ సాయంత్రం వరకు ఆప్యాయంగా గడిపారు. ఆటలు, పాటలతో కొండ ప్రాంగణంలో సందడి చేసి, మరిన్ని తీపి గురుతులను వెంటబెట్టుకుని తిరుగుముఖంపట్టారు.

కశింకోట : స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2001-02 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు ఇక్కడి ప్రమీలా తోటలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పదో తరగతి పూర్తి చేసుకుని రెండు దశాబ్దాలైన సందర్భంగా కలిశారు. తాము చదువుకున్న పాఠశాల తరగతి గదుల్లో కాసేపు గడిపారు. పరస్పరం ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు దిగి జ్ఞాపకాలను పదిలపరచుకున్నారు.



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ 2001-02 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

ఏఎన్నార్‌కు ఘన నివాళి



వృద్ధులకు వస్త్రాలు అందిస్తున్న బల్లా నాగభూషణం, సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి వేడుకలు జరిగాయి. అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పేద వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అక్కినేని అభిమానులు పాల్గొన్నారు.

గంగాధర్‌కు అభినందనలు



గంగాధర్‌ను సత్కరిస్తున్న జానకిరామరాజు

అనకాపల్లిటౌన్ : 21 ఏళ్లలో చార్టెడ్ అకౌంట్స్ పూర్తి చేసిన స్థానిక విజయరామరాజుపేట నివాసి అప్పికొండ గంగాధర్‌ను వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు అభినందించారు. 82వ వార్డులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గంగాధర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అప్పికొండ వెంకటరావు, వీధిపెద్దలు పాల్గొన్నారు.